# బుల్లి రాక్షసుడు

నందిరాజు పద్మలతా జయరాం

రెండురోజుల క్రితమే క్యాంప్‌కెళ్ళారు శ్రీవారు. పెద్దవాడు స్టేట్స్‌లో ఎమ్మెస్ చేస్తున్నాడు. చిన్నాడేమో కాలేజీకి వెళ్ళిపోయాడు. చేసేందుకు పెద్దగా పనేమీ లేక, కాస్త కల్యాణికి పనిలో సాయం చేద్దామని వాళ్ళింటికెళ్ళాను.కల్యాణిది ప్రభుత్వోద్యోగం. వాళ్ళాయన ఉదయం ఆరున్నరకల్లా బయల్దేరి డ్యూటీకి వెళ్ళిపోతారు.



బుజ్జి గణేశ్ వాళ్ళ ముద్దులకొడుకు. నిండా రెండేళ్ళుకూడా రాలేదు కానీ, అబ్బో! వాడు కబుర్లపుట్ట. వాడి భాషకి ఇంకా డిక్షనరీ తయారు చేయబడలేదు. ఆ పదజాలం, అందులోని వ్యాకరణం మాత్రం వాడి సొంతం. ముద్దుగా, బొద్దుగా పెద్ద, పెద్ద కళ్ళతో చూడముచ్చటగా వుంటాడు వాడు. పసిపిల్లల్ని పెంచి పధ్నాలుగేళ్ళు దాటిపోవడంతో, నాకు బుజ్జి గణూని చూస్తే చాలా మురిపెం. వాడు కూడా నన్ను, 'అమ్మా' అనో, 'పెద్దమ్మా' అనో కాక, 'అమ్మలాలూ' అని పిలుస్తాడు.

వాళ్ళింటికెళ్ళేసరికి, బుంగమూతి పెట్టుకుని, బుద్ధిగా సోఫాలో కూర్చున్న గణూగాడు కనిపించాడు. గభాలున వాడిని ఎత్తుకుని లోపలికి నడిచాను.

''ఏంటి కన్నా! అలా వున్నావేం?'' అని అడిగాను.

''అమ్మా కొత్తింది. ఇక్కల..'' అంటూ బుగ్గ చూపించాడు వాడు. వాడి లేలేత గులాబీ బుగ్గమీద ఎర్రగా కందిన చేతి గుర్తు.

నాకు ఒళ్ళు మండిపోయింది.

''బొత్తిగా జ్ఞానం లేదేమే కళ్యాణీ! పసివాణ్ణి పట్టుకుని కొడ్తావా!'' కోపంగా అన్నాను.

''హు! వీడు పసివాడా! పిల్ల పిశాచంగాడు. కంట్లోంచీ కను పాలు పీకేస్తున్నాడు. అటు తిరిగితే చాలు, ఇటు ఏవో ఒక వెధవపని చేస్తాడు. ఈ అల్లరికి తట్టుకోలేకపోతున్నాను.'' కళ్ళనీళ్ళ పర్యంతమైపోయింది కల్యాణి.

కాస్త కష్టపడి విషయం ఆరా తీశాను. తెల్లారక ముందే నిద్రలేచి పాలకోసం పేచీపెట్టిపాలు కలిపి ఇచ్చాక, నెమ్మదిగా సీసాకున్న పీకని కాస్తా పీకేసి, పాలన్నీ వీధికుక్కకి పోసే సాట్ట. ఆ తర్వాత తీరిగ్గా సోఫా కింద చేరి ఏవో ఘన కార్యం చేసినట్లు కాసేపయ్యాక తల్లిని పిలిచాడట. ఏమిటా అని చూస్తే, తండ్రి రేజర్ సెట్‌లో నుండీ షేవింగ్‌క్రీమ్ పులిమేసుకుని రేజర్‌తో గడ్డం గీసుకుంటున్నాడట. పైనా కిందా, వాడి ఒంటిమీదా ఎక్కడచూసినా షేవింగ్ క్రీమే. అదంతా కడిగి, వాడిని శుభ్రం చేసేసరికి దానికి తల ప్రాణం తోకకొచ్చిందట. అదీ దానికోపం మరియు పిల్లవాడి మీద దాని ప్రతాపం యొక్క కథ.

''అంత కోపమైతే ఎలాగే? పిల్లలన్నాక ఆ మాత్రం అల్లరి చేయకుండా వుంటారా!'' అంటూనే వాడికి బట్టలు తొడిగి, టిఫిన్ పెట్టేశాను.

''చాలా థాంక్స్! ఇంకా వీడిని తీసికెళ్లి అమ్మ దగ్గర దింపాలి కదా! ఎందుకోనే, ఈ మధ్య అమ్మ మరీ స్వార్థపరురాలై పోయిందే! ఇలా అంటున్నానని అనుకోవద్దు కానీ, బుజ్జిగాడిని చూసుకోవడానికి ఏమిటో తెగ ఇబ్బంది పడిపోతోంది. ఏదో ఓ వంక చెప్పి వాడిని ఏ కేర్‌సెంటర్‌లోనో పడెయ్యమని ఇక డైరెక్ట్‌గా చెప్తోంది. మా ఆయనకేమో కేర్ సెంటర్ అంటే ఇష్టం వుండదు. అందుకే, వీడిని ఏ నర్సరీలోనో చేర్చేద్దాం అనుకుంటున్నాను. స్కూల్ అయ్యాక ఓ రెండు గంటలు అమ్మ చూసుకుంటే చాలు.'' బ్యాగ్ పుచ్చుకుని తయారవుతూ అంది.

''నీ ముఖం. నేను లేనూ! ఎటూ ఖాళీనే కదా! నాకూ పిల్లలంటే మహా సరదా! అయినా రెండేళ్ళు కూడా నిండని మాటలు కూడా సరిగా రాని బుజ్జిగాడిని బళ్ళో చేర్చడమేంటే?'' బాధగా అన్నాను.

''నీ వల్ల కాదులే అక్కయ్యా! స్కూల్‌లో చేర్చడమే మార్గం.''

''మన వెసులుబాటు కోసం పిల్లల్ని బడి అనే జైల్లో దింపి, మనం చేతులు దులుపుకుంటున్నాం. కానీ, అసలు పిల్లలు మానసికంగా ఎదిగేది, పరిణతి చెందేది మూడు నుండి అయిదేళ్ల లోపునే. ఏదో తెలుసుకోవాలి అనే తపన, ఉత్సాహం వాళ్లల్లో విపరీతంగా వుంటుంది. పెద్దవాళ్ళని అనుకరించాలి అనే వాళ్ళ తాపత్రయాన్ని మనం 'ఆగడం' 'అల్లరి' అనుకుంటాం. నిజానికి అది వాళ్ళు ఎదుగుతున్నారు అనేందుకు సూచన. అమ్మా, అమ్మమ్మలు చూపే ప్రేమ, ఆప్యాయత కేర్ సెంటర్‌లో, నర్సరీల్లో దొరకుతుందా! ఏవో డబ్బు కోసం ఒక వృత్తి మాదిరిగా పిల్లల్ని సంరక్షిస్తారే తప్ప, అందులో అభిమానం ఆప్యాయత దొరకదు కదా!'' నాకు తెలిసిన విషయాల్ని ఏకరువు పెడుతూంటే మధ్యలో ఆపింది కల్యాణి.

''సరే! అక్కయ్యా! వీడిని నువ్వు చూసుకోగలను అంటున్నావు కదా! ఓ రెండ్రోజులు నీ దగ్గరే వుంచుకో!'' ఇంటికి తాళం వేసి నాతోపాటు బయల్దేరింది కల్యాణి. తను బస్టాపుకి, నేను మా ఇంటికి దారి తీశాం.

ఇంటికి వచ్చేదార్లోనే తల్లికోసం ఏడవడం మొదలెట్టాడు గణా!

''వచ్చేస్తుంది నాన్నా! సాయంత్రం వచ్చేటప్పుడు నీ కోసం చాక్‌లెట్లు తీసుకొస్తుంది. ఇప్పుడు మనింటికెళ్దామే.'' నచ్చచెప్పి ఇంటికి తీసుకొచ్చాను.

''అమ్మలూ! నాకూ ఇక్కి కాలి.'' చెప్పాడు వాడు.

నాకు అర్థం కాలేదు.

''నాకు ఇక్కి కాలీ, కాలీ కాలీ'' ఏడుపు ఇంకా పెరుగుతూనే వుంది. ఏ కాలు కాలిందో అనుకుని వెతికి, వెతికి చూశాను. ఉహు! వాణ్ణి మరిపిద్దామని టి.వి ఆన్ చేశాను. అందులో 'యాడ్' రాగానే ఠక్కున ఏడుపు ఆపేసి, ''ఇక్కీ కాలీ!'' అంటూ చూపించాడు వాడు.

అప్పుడర్థమయింది నాకు. అది బిస్కెట్స్ అడ్వర్టయిజ్‌మెంట్.

వాడి భాషలో ఇక్కి అంటే బిస్కెట్ అన్న మాట.

మళ్ళీ వాణ్ణి చంకనేసుకుని దుకాణానికి తీసుకు వెళ్ళి ఓ ప్యాకెట్ బిస్కెట్స్ కొన్నాను. పక్కనే సీసాలో వున్న క్యాడ్‌బరీ చాక్‌లెట్ చూపించి 'కాఢీ కాలీ' అన్నాక క్యాడ్‌బరీస్‌కి ఆ మాట రూపాంతరం అని అర్థమయి అవి కూడా కొని ఇల్లుచేరాను.

షోకేస్‌లో బొమ్మలన్ని కిందకి దింపి వాడి ముందు పెట్టి వంటగదిలోకి వెళ్ళాను. కాసేపవగానే మోగుతున్న టి.వి.కాస్తా ఆగిపోయింది.

'కరెంటు పోలేదే! టి.వి ఆగిపోయిందేంటబ్బా' అనుకుంటూ వచ్చిన నాకు గుండె గుభేలుమంది. వాడి ముందున్న బొమ్మలన్నీ వదిలేసి, చిన్న స్టూల్ లాక్కుని ఎక్కి, టి.వి. ప్లగ్‌పీకి దాన్ని పరీక్షిస్తున్నాడు సీరియస్‌గా.

''ఇంకా నయం. షాక్ కొట్టలేదు.'' అనుకుంటూ వాడిని దింపి, వాడిని నాతో పాటే వంటగదిలోకి తీసెళ్ళిపోయాను.

బిందెల్లో నీళ్ళన్నీ గ్లాసుల్తో తీసి కింద పారబోస్తూ ఆడుకుంటున్నాడు గణా. అయిదు నిమిషాలయిందో లేదో మళ్ళీ మొదలెట్టాడు.''అమ్మ కాలీ హు...హు...'' అంటూ.

ఇలా కాదని వాణ్ణి చంకనేసుకుని మేడమీదికి తీసికెళ్ళి కాకుల్ని, పిచ్చికల్ని చూపించాను.

''కాకెలా అరుస్తుందమ్మా?'' అడిగాను.

''మ్యావ్!మ్యావ్!'' అన్నాడు వాడు.

''ఛ..ఛ...కావు, కావు అంటుంది..''

''మరి పిల్లేమంతుందీ?''

''పిల్లా..పిల్లేమో మ్యావు అంటుంది. నువ్వు చెప్పు కుక్కేమంటుంది?''

''నువ్వే చెప్పు!''

''భౌ..భౌ.. అంటుంది.. ఆ ! మరి కోడేమంటుందీ?'' అడిగాను.

'' ఏమో నువ్వు చెప్పు...'' ముద్దుగా అన్నాడు వాడు.

''కోడి కొక్కొరొకో...అంటుంది. ఇప్పుడు చెప్పూ! అదిగో అదేంటి?'' పిచ్చికని చూపించి అడిగాను.

''అది నువ్వే!'' అన్నాడు వాడు సీరియస్‌గా.

''ఛ! అది నేనా! సరిగ్గా చెప్పు.''

''అమ్మలలా! అది పిచ్చి. అంటే.. నువ్వే!'' పకపకా నవ్వుతూ గణా.

నాకు ఒళ్ళుమండిపోయింది. నా చేత అడ్డమైన కూతలూ కూయించి, పైగా 'పిచ్చి' అంటాడా! ఆఁయ్. గిరుక్కున ఇంట్లోకి తిరిగొచ్చి...

''అల్లరి వెధవా? పన్లన్నీ మానేసి ఎత్తుకుతిప్పితే నాకు పేర్లు పెడతావా! ఇదిగో ఈ బొమ్మలతో ఆడుకుంటే ఆడుకో! లేకపోతే ఫో!'' అంటూ స్నానానికి వెళ్ళిపోయాను.

బాత్‌రూంలోంచీ బైటికి వచ్చేసరికే ఇల్లంతా బ్రహ్మాండమైన మింట్ వాసన. హాల్లోకి పరిగెత్తి చూసేసరికీ, పెద్దవాడు అమెరికానుంచీ పంపిన రెండుమూరల పొడుగుండే టూత్‌పేస్ట్‌ని హాల్లోని టైల్స్‌మీద మొత్తం ఒత్తిపారేసి అలుకుతున్నాడు గణా. చేతులకి అంటిన పేస్ట్‌ని అప్పుడప్పుడూ నాలిక్కి రాసుకుంటూ గుళ్ళో వీభూతి పండులా వున్నాడు వాడు.

''ఏం పనిరా ఇదీ? ఎక్కడినుంచీ తీశావ్!'' అరిచాను.


నా అరుపుకి అదిరాడో ఏమో, ఆరున్నొక్క రాగం ఎత్తుకున్నాడు.

''ఏం లేదమ్మా! ఎంత బాగా రాశావో నేలమీద. మా బంగారు తండ్రి కదూ! బుజ్జినాన్న కదూ!'' అంటూ వాడిని బుజ్జగించి ఒళ్ళంతా కడిగి మంచంమీద కూర్చోబెట్టి హాలు కడగడానికి నడుం కట్టాను. అదేం టూత్‌పేస్టో! చుక్కనీళ్ళు పడితే


విశ్వసించు-
విజయాన్ని పొందు

తెలుగు/హిందీ/
ఆంగ్లంలో లభించే
ఉచిత పుస్తకానికై
నేడే మాకు వ్రాయండి.

అబండెంట్ లైఫ్ రిసోర్సెస్
పోస్ట్ బ్యాగ్ నెం. 24,
సికింద్రాబాద్ - 500 026.




చాలు జువ్వున నురుగు. ఎన్ని బకెట్ల నీళ్ళు పోసినా పొంగులు పొంగులుగా నురుగొస్తూనే వుంది. దానిని ఊదుతూ ఆడుకుంటున్నాడు గణూ. వాడి ముఖంలో స్వర్గాన్ని గెలిచినంత ఆనందం. అంతా కడిగాక నిఠారుగా నిల్చోడానికి రాదే నా నడుము.

''హమ్మో! వీడు పిల్లాడు కాడు. పిడుగురా బాబూ!'' అనుకుంటూండగానే, నాకే గుర్తొచ్చింది వాడికింకా అన్నం పెట్టలేదని.

ఇక అదొక ప్రహసనం. కార్లు, బస్సులు, కాకులు, పిచ్చుకలు, బొమ్మలు ఇలా అడ్డమైన వాటినెన్నింటిని చూపించి, రకరకాలుగా గొంతులు మార్చి మాట్లాడి అష్ట కష్టాలూ పడి వాడిచేత నాలుగు ముద్దలు తినిపించేసరికే పన్నెండయ్యింది. ఇంకా నా పూజ కాలేదు.

వాడి ముందు ఓ బక్కెట్టు నీళ్ళు, ఓ గ్లాసూ పెట్టి వంటగదిలోనే నాతోపాటు వుంచుకుని పూజ మొదలెట్టాను.

''అమ్మలలూ! నేను పూలు తోచుకులానా?''

వాడి భాష నాక్కొంచెం కొంచెం అర్థమవుతోంది. ఒకోసారి 'క' స్థానంలో వాడికి 'త' పలుకుతుంది.

''సరే! కోసుకురా నాన్నా!'' అన్నాను.

అయిదు నిమిషాల్లో వచ్చాడు వాడు చేతినిండా పూలతో!

''అమ్మలలూ నీకోచమే! చీచుకో!'' అంటూ వాడి చొక్కాలో దాచుకున్న పూలన్నీ నా ఒళ్ళో పోశాడు.

''బంగారు కొండ! మీ అన్నయ్యయితే గంటసేపు కోసి గుప్పెడు పూలు తెస్తాడు. నువ్వే నయంరా!'' అంటూ ఒళ్ళో చూసేసరికి నాకు కళ్ళ నీళ్ళు తిరిగాయి.

వాడు కోసినవన్నీ పెరట్లో పూసిన బీర,సొర పూలు. మరికొన్ని కాకర, టమాటా పూలు, పిందెలు.

''అమ్మలలూ! అన్నీ కోచేచా!'' చేతులు తిప్పుకుంటూ గర్వంగా చెప్పాడు వాడు.

మనసులో వాడిని తిట్టుకుంటూనే పూజ గబగబా ముగించేసి లేచాను.

గణూగాడెక్కడున్నాడా అని చూసేసరికి, ఒక్కసారిగా నా గుండె గుభేలుమంది.

మేడ మెట్లెక్కి పైనున్న పిట్టగోడమీదికి ఎలా ఎక్కాడో రెండు కాళ్ళూ బైటివైపుకి పెట్టుకుని కరెంటు తీగల మీదున్న కాకుల్ని తోలుతున్నాడు వాడు.

''ఒరేయ్'' గట్టిగా అరవబోయి, అరిస్తే భయపడి ఎక్కడ ముందుకు దూకేస్తాడో అనుకుని అతి నెమ్మదిగా వెనకనుంచీ వాడిని పట్టుకుని కిందికి దింపాను. పావుగంటపాటు తగ్గలేదు నా గుండె దడ.

''నేనక్కలే కూచుంతా! కాకుల్తో ఆలుకుంతా! వాc...'' ఏడుస్తున్న వాడిని తీసుకు వచ్చి బెడ్‌రూమ్‌లో డ్రెసింగ్ టేబిల్ మీదున్న క్లిప్పులు, రబ్బర్ బ్యాండ్లు, స్టిక్కర్లూ ఇచ్చి ఆడుకోమన్నాను.

''బుజ్జినాన్నా! నేను అన్నం తినొస్తా నానా! నువ్వు ఆడుకో!'' అంటూ వెళ్ళి ఆయిదే నిమిషాల్లో నాలుగు మెతుకులు గతికి బైటపడ్డాను.

బెడ్‌రూంలో అడుగేసానో లేదో ''కయ్యి'' మని అరిచి ఒక్క గెంతులో ఇవతలికొచ్చాను. గదిలో నన్ను భయపెట్టిన ఆకారం కూడా అదే రేంజిలో అరిచి బైటికొచ్చింది. ఆ గొంతు విన్న తర్వాతగానీ ఆ నల్లటి విగ్రహం 'గణూ' అని కన్‌ఫర్మ్ కాలేదు.

ఒంటి మీద వెంట్రుకవాసి కూడా గ్యాప్ లేకుండా కాటుక పులుముకున్నాడు. తెల్లటి కళ్ళు, ఎర్రటి నాలుకా. ప్రమధ గణంలో ఒకడిలా వున్నాడు వాడు. వాణ్ణింకోసారి ఏడిపించి, వాడు వాడే' అని తీర్మానించుకున్నాను.

ఆ తర్వాత మరో గంటన్నరపాటు వాడి ప్రక్షాళనా కార్యక్రమం అయ్యాక వాడిని పడుకోబెట్టి, నేనూ ఒరిగాను. నిద్ర పుచ్చడం కోసం జోలపాట మొదలెట్టాను.

''లాలీ...లాలీ...వటపత్రసాయికీ...''

''అమ్మా లలూ! నాకు నిద్దలొత్తూంది. నువ్వు పాటపాలొద్దు.'' చెప్పాడు.

''గాడిదా! నా పాట అంత కఠోరంగా వుందత్రా'' అనుకుని ఠక్కున ఆపేశాను. అలసి ఉన్నానేమో కొద్దిగా కునుకు పట్టింది.

ఎక్కడో నీళ్ళుపోతున్న శబ్దం, దానితో పాటు ఏదో ఘాటైన వాసనా. మెలకువొచ్చేసింది.

బాత్‌రూంలో నల్లా తిప్పేసి వుంది. అది ఆపి వంటగదిలోకెళ్ళాను. గ్యాస్ స్టవ్ స్విచ్ 'ఆన్'లో వుంది. ఆ వాసనే నన్ను నిద్రలేపింది.

''అమ్మయ్యో! పిల్లాడేడీ?'' అనుకుంటూ రాబోతూంటే బైటినుండీ ఏడుపు వినిపించింది. తలుపేమో బైటినుండీ లాక్ చెయ్యబడి వుంది. మాది గాడ్రెజ్‌లాక్. ఒకసారి పడిందంటే అంతే! మళ్ళీ తాళం చెవితో తెరవాల్సిందే!

వాడు బైట. నేను లోపలా! అవతల వాడి ఏడుపుతో ఇల్లదిరిపోతోంది.

పక్కింటికి ఫోన్ చేసి ఆవిడ్ని పిలిపించి, కిటికీ లోంచీ తాళం చెవి అందించి తలుపుతీయించి బైట పడ్డాను.

పీకేసిన ఆకులు, పూల మధ్య వెక్కివెక్కి ఏడుస్తూ బుజ్జిగణూ!

సాయంత్రం ఆరున్నరెప్పుడవుతుందా అని ఎదురుచూస్తూ కూర్చున్నాను. టి.వి., గడియారం, రేడియో వగైరాలన్నీ వాడి ప్రతాపానికి బలైపోయాయి.

క్యాంప్ నుండీ వచ్చి శ్రీవారు-

''ఇదేవిటే! నా మీద దిగులుపడి అన్నం తినడం మానేసావా! అంత బెంగ పడితే ఎలాగోయ్?'' నా వాలకానికి కారణం ఆయన మీద ప్రేమేమో అనుకుని తెగ మురిసిపోయారు.

ఆయన ముచ్చట నేనెందుకు కాదనాలనుకుని పిల్లాడిని చంకనేసుకుని కాఫీ కాస్తున్నంతలోనే కల్యాణి వచ్చింది.

''చాలా థాంక్సక్కయ్యా! పిల్లాడు నీ దగ్గరున్నాడు కాబట్టే నాకు ఎంతో నిశ్చింతగా వుంది. ఏరా బుజ్జీ ఇంక రోజూ అమ్మ దగ్గరే వుండూ!'' అని వాణ్ణి ముద్దులాడసాగింది.

వాడెక్కడ 'అలాగే' అంటాడో అని...

''ఒసేయ్ కల్యాణీ! మనం అనుకుంటాం గానీ, ఈతరం పిల్లలకి అవగాహనా జ్ఞానం ఎక్కువ. వాళ్ళకి అన్నీ తొందర, తొందరగా వచ్చేస్తాయి. అందులోనూ నీ కొడుకు స్మార్ట్ కిడ్. చాకులాంటి వాడనుకో! ఇలా ఇంట్లో వుంచి కాకమ్మ కబుర్లు అమ్మమ్మ కథలూ చెప్పి పెంచే కన్నా, ఎంచక్కా స్కూల్‌లో వేశావనుకో, అయిదేళ్ళకే అమోఘంగా చదివేసి అఖండుడు అనిపిస్తాడు. పైగా, పిల్లల మధ్య వుండడం వలన వాడికి కలివిడితనం కూడా పెరుగుతుంది. రేపే వాణ్ణి స్కూల్లో చేర్చెయ్యి!'' చెప్పేశాను.

ఒక్కపూటలోనే నాలో వచ్చేసిన మార్పుకి కల్యాణి నోరు తెరిచి ఆశ్చర్యపోతూంటే, మా వారు నా అవస్థ గమనించి ముసి ముసి నవ్వులు నవ్వసాగారు.

గణూగాడు మాత్రం ఇవేమీ పట్టనట్లు వాళ్ళమ్మ భుజంమీదినుంచీ పింగాణీ కప్పుల దొంతరను అందుకుని ఒక్కసారిగా లాగేశాడు. పగిలిన ముక్కల్ని చూసి చప్పట్లు చరుస్తూ పకపకా నవ్వేశాడు బుజ్జిగాడు కాదు... బుల్లి రాక్షసుడు. ■